www.prajasakti.com

ప్రజాశక్తి

5

బుధవారం 28 ఫిబ్రవరి 2024

తిరుపతి



1వ తేదీ నుంచి

టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడాపోటీలు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడాపోటీలు మార్చి 1వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు తిరుపతిలోని పరిపాలనా భవనంలో గల పరేడ్ మైదానంలో ప్రారంభమవుతాయని టీటీడీ చీఫ్ పిఆర్ఓ డాక్టర్ రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు మార్చి 18వ తేదీ వరకు జరగనున్నాయి. ప్రారంభ కార్యక్రమంలో క్రీడల్లో పాల్గొనేందుకు నమోదు చేసుకున్న ఉద్యోగుల పేర్లు, టీమ్‌లు, పోటీ షెడ్యూల్ తదితర వివరాలు తెలియజేయడం జరుగుతుంది. పురుషులకు, మహిళలకు వేరువేరుగా పోటీలు నిర్వహిస్తారు. ఇందులో టగ్ ఆఫ్ వార్, చెస్, వాలీబాల్, క్యారమ్స్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, షటిల్, టెన్నిస్ తదితర క్రీడలు నిర్వహిస్తారు. టీటీడీ సంక్షేమ విభాగం డెప్యూటీ ఈవో స్నేహలత క్రీడల ఏర్పాట్లను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

భూ రాబందులను వదలి..

పేదలపైనే ప్రతాపం

లాఠీ ఛార్జిలో గాయపడిన మహిళ

- జెసిబిలతో గుడిసెలు తొలగింపు
- అడ్డుపడిన వారిపై లాఠీఛార్జ్
- మహిళలపైనా పోలీసుల దౌర్జన్యం
- సీపీఎం నేతల "హౌజ్ అరెస్టు"లు
- పేదలకు న్యాయం చేయకుంటే ఉద్యమం ఉధృతం: నేతల హెచ్చరిక

ప్రజాశక్తి - తిరుపతి

కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములలో తిష్ట వేసిన భూరాబందులను వదిలి.... జానెడు ఇంటి స్థలం అడిగిన పేదలపై అటు అధికారులు, ఇటు పోలీసులు తమ ప్రతాపాన్ని చూపుతున్నారు. రేణిగుంట మండలం, కరకంబాడి ఎర్రగుట్టపై పేదలు వేసుకున్న గుడిసెలపై మంగళవారం తెల్లవారు జామున తమ జులుంను ప్రదర్శించారు. వందలాది పోలీసులు చొరబడి, జెసిబిలతో గుడిసెలను నేలమట్టం చేశారు. ప్రొక్లైన్లను అడ్డుకున్న పేదలపై లాఠీ చార్జ్ చేశారు. అంతకు ముందే సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, రేణిగుంట మండల కార్యదర్శి హరినాథ్, సిఐటియు మండల అధ్యక్షుడు నరసింహారెడ్డిని ముందస్తుగానే ఉదయం 3 గంటల నుంచే హౌజ్‌అరెస్ట్ చేసి ఇంటి నుంచి బయటకు రానీయకుండా నిర్బంధించారు. ఇళ్ల స్థలాల సాధన పోరాట కమిటీ అధ్యక్షులు రాజశేఖర్, కార్యదర్శి సత్యశ్రీ, కమిటీ నాయకులు రాధిక, మునిబాబు, అరుణ్, మస్తాన్లను అరెస్టు చేశారు. అదే సమయంలో లాఠీ చార్జీతో స్పృహ తప్పిన సిపిఎం సీనియర్ నాయకులు శివానందంనూ విడిచిపెట్టలేదు. సీనియర్ కామ్రేడ్ వెంకట రమణపైనా దాడి చేయడంతో ఎడమ కాలికి తీవ్రగాయమైన విడవకుండా 'పేదలకు సపోర్టు వస్తారా మీ సంగతి తేలుస్తామంటూ దౌర్జన్యం చేశారు. పోలీసుల నిర్బంధం నుంచి బయటకు వచ్చిన సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రజాసంఘాల నేతలు రేణిగుంట పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించారు. పేదలకు న్యాయం చేయాల్సిన జిల్లా కలెక్టర్, ఎస్పీలు ఇలా కుట్ర చేసి మరీ పేదలపై దౌర్జన్యం చేయడం దుర్మార్గమన్నారు. పేదలకు న్యాయం చేసే వరకు సిపిఎం బాధితులకు అండగా ఉంటుందని ఉద్ఘాటించారు. వెంటనే పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

జెసిబితో గుడిసెలను కూల్చుతున్న దృశ్యం

పేదలకు మద్దతుగా నిలుస్తాం: సిపిఎం, సిపిఐ

భూ కబ్జాలపై 1వ తేదీ వామపక్షాల రౌండ్ టెబుల్ సమావేశం

వామపక్ష నాయకుల స్పష్టీకరణ

తిరుపతి (మంగళం): నిరుపేదలు గూడు కోసం చేస్తున్న పోరాటంపై అధికారులు మానవతా దృక్పదంతో వ్యవహరించాల్సింది పోయి పోలీసులను అడ్డుపెట్టుకొని ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పేదల గుడిసెలను కూల్చుతారా అని సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సిపిఎం, సిపిఐ నాయకులు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నాగరాజు మాట్లాడుతూ రేణిగుంట మండలం కరకంబాడీ పంచాయతీలోని సర్వే నెంబర్ 153/1 ఎర్రగుట్టపై గత నెల రోజులుగా జగనన్న పట్టాలు పొంది స్థలాల కోసం ఎదురుచూస్తున్న అర్హులు గుడిసెలు వేసుకొని పోరాటం చేస్తుంటే దాదాపు 600 మంది పోలీసులను, యంత్రాలను, ఫైర్ ఇంజన్లను పేదల గుడిసెల వద్దకు చేరుకొని ఒక్కసారిగా గుడిసెలను కూల్చివేయడం దారుణమన్నారు. ఇటు మంగళంలోనూ జగనన్న ఇళ్ళ పట్టాలు పొందిన వారికి అదే ప్రాంతంలోని చెన్నాయిగుంట సర్వే నెంబర్ 195/2లో స్థలాలను చూపాలని పోరాటం చేస్తే పోలీసులతో బలవంతపు అరెస్టులు చేయిస్తున్నారు. తిరుపతిలో కార్పొరేటర్లు, చంద్రగిరిలో, శ్రీకాళహస్తిలో నాయకులు వేల ఎకరాలు కబ్జాచేసి అమ్ముకోంటూ కోట్లు గడిస్తున్నారని, దోచుకున్న ఆయా కబ్జా భూముల్లో ఇది ప్రభుత్వ స్థలాలు అని బోర్డులు నాటే ధైర్యం అధికారులకు ఉందా అని సిఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అదికారులకు సూటిప్రశ్న వేశారు. జిల్లా కలెక్టర్ పేదల పక్షపాతిగా మెలగాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ తిరుపతి రూరల్ పరిధిలోని కూపుచంద్రపేటలో 200ఎకరాలకు పైగా భూఆక్రమణలు జరిగాయన్నారు. సాక్ష్యాతు తిరుపతి మేయర్ బంధువుల స్థలాన్ని కబ్జా చేసిన పట్టించుకోనే నాధుడేలేదన్నారు. నేడు అధికార పార్టీ నాయకులు చేస్తున్న భూకబ్జాలకు అధికారులు అండగా ఉండి మరీ ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. నేడు జరుగుతున్న భూకబ్జాలు, పేదలకు స్థలాల అంశాలపై 1వ తేదీ శుక్రవారం సిపిఐ కార్యలయంలో వామపక్ష పార్టీల రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సిపిఎం నగర కార్యదర్శి సుబ్రమణ్యం, వేణుగోపాల్, బుజ్జి, మాధవకృష్ణ, సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చిన్నం పెంచులయ్య, అమ్ములు, కుమారి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: పెద్దలనొదిలేసి పేదలపైనే ప్రతాపం చూపడమేంటని సిపిఎం నాయకులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కరకంబాడీలో పోలీసులు అర్ధరాత్రి పేదల ఇల్లు కూల్చడంపై మంగళవారం సిపిఎం నాయకులు అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలియజేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి గంధం మణి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కరకంబాడిలోని 600 కుటుంబాలకు మూడేళ్ల కిందట ఇంటి పట్టాలు మంజూరు చేశారని తెలిపారు. అయితే ఇప్పటివరకు స్థలాన్ని చూపించలేదనీ, పేదలు ఎక్కడ నివసించాలని ప్రశ్నించారు. పది రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పిన ఎమ్మెల్యే, పోలీసులకు గుడిసెలు కూల్చేయాలని ఆదేశించడం దుర్మార్గమని వాపోయారు. ప్రభుత్వం వెంటనే పేదలకు స్థలాలు చూపించాలని డిమాండ్ చేశారు. పెనగడం గురవయ్య, కుమార్, వెలివేంద్రం, ఉస్మాన్ బాషా, రాజా, చిన్నబాబు పాల్గొన్నారు.

రేణిగుంట: రేణిగుంట మండలంలో సర్వే నెం. 153/1 నందు కరకంబాడీ ఎర్రగుట్ట పై సుమారు 5వేలు మంది గుడిసెలు వేసుకొని 33 రోజులుగా జీవనం సాగిస్తుంటే మంగళవారం జిల్లా కలెక్టర్, ఎస్పీ నాయకత్వంలో పేదల గుడిసెలను తొలగించడం,పేదలపై లాఠీ ఛార్జి చేయడం దుర్మార్గమని ఈ ఘటనను సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నామని రేణిగుంట మండల కార్యదర్శి కె.హరినాథ్ పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.

ఏర్పాట్లను తనిఖీ చేసిన ఎస్పీ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

సార్వత్రిక ఎన్నికలు-2024 సమీపిస్తున్న నేపథ్యంలో విధుల నిమిత్తం తిరుపతి జిల్లాకు కేంద్ర పారా మిలటరీ సాయుధ బలగాలు (సిఆర్‌పిఎఫ్, సిఐఎస్ఎఫ్) రానున్నాయి. వారు స్థానికంగా ఉండేందుకు ఏర్పాటు చేస్తున్న వసతి సముదాయాల వద్ద జిల్లా ఎస్పీ మలిక గర్గ్ మంగళవారం స్వయంగా తనిఖీ చేసి, పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో సాధారణ ఎన్నికల విధుల నిర్వహణలో కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీసులు సమిష్టిగా కలిసి పని చేసి ప్రశాంతంగా ఎన్నికల ముగింపుకు కృషి చేస్తుందన్నారు. కేంద్ర సాయుధ బలగాలు ఎన్నికల ప్రక్రియ ముగిసేంతవరకు స్థానికంగా ఉంటారని, అందుకు అనువైన భద్రత ఉన్న ప్రదేశాలను ఇప్పటికే గుర్తించడం జరిగిందని తెలిపారు. ఆ వసతి సముదాయాల వద్ద మౌలిక వసతులు అయిన నీరు, తాగునీరు, ఆహార పదార్థాలు, విద్యుత్తు సరఫరా, వారికి అవసరమైన రవాణా సదుపాయాలను నిరంతరం కల్పించాల్సిన బాధ్యత స్థానిక పోలీసులదేనని పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సాయుధ దళం డిఎస్పి ఉన్ రవీంద్రారెడ్డి, ఎస్వీయూ క్యాంపస్ పోలీస్ స్టేషన్ సీఐ మురళీమోహన్ రావు పాల్గొన్నారు.

మాజీ సైనికుల పేరుతో ఆర్డీవో భూదందా..

- పూర్వపు తహశీల్దార్, కార్యాలయ సిబ్బంది సంతకాలు సైతం ఫోర్జరీ
- కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌పై మంత్రి ద్వారా ఒత్తిళ్లు
- బోగస్ పత్రాలతో నిషేధిత జాబితా నుంచి తొలగించడానికి కలెక్టరేట్లో దస్త్రం సిద్ధం
- కురుకాలువ భూములపై కన్నేసిన పెద్దలకు
- తిరుపతి మాజీ ఆర్డీవో అండదండ

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో:

అధికారం ఉంటే ఏమైనా చేయవచ్చు.. నా ఇష్టం.. నా రాజ్యం.. నేను అనుకున్నదే వేదం... అనే విధంగా తిరుపతి రెవెన్యూ డివిజన్ పరిధిలో సుదీర్ఘకాలం ఆర్డీఓగా పనిచేసిన పూర్వపు ఆర్డీవో రేణిగుంట మండలం కురుకాలవ రెవెన్యూ గ్రామంలో మాజీ సైనికుల పేరుతో సాగిస్తున్న భూదందా అంతా ఇంతా కాదు. రేణిగుంట పూర్వపు తహశీల్దార్ల సంతకాలను సైతం ఆర్డీఓ ఫోర్జరీ చేసి జిల్లా కలెక్టర్‌ను జాయింట్ కలెక్టర్‌ను సైతం తాను సృష్టించిన బోగస్ రికార్డులు నిజమైన రికార్డులుగా భావించాలని జిల్లాలోని ఓ పెద్ద మంత్రి ద్వారా ఒత్తిడి తెప్పిస్తూ ఆయన సాగిస్తున్న భూదందా చూస్తూంటే రాష్ట్రంలోని యావత్ రెవెన్యూ యంత్రాంగాన్ని ఆశ్చర్యచకితులను చేస్తోంది.

రేణిగుంట మండలం కురుకాలవ రెవెన్యూ సర్వేనెంబర్‌లో 266, 267, 268 సర్వే నంబర్లలో 1986వ సంవత్సరంలో నలుగురు వ్యక్తులకు 16ఎకరాల భూమిని అధికారికంగా అప్పట్లో సర్వే నంబర్ 1 బ్లాక్ నంబర్ నుంచి విడదీసి సబ్‌డివిజన్ చేసి కొత్త నంబర్లు కేటాయించి అసైన్మెంట్ చేశారు. ఆ మేరకు రైతులు భూమిని సాగు చేసుకునేవారు. అయితే 1993లో రేణిగుంట మండల రెవెన్యూ అధికారి మండల వ్యాప్తంగా అసైన్మెంట్ జరిగిన భూములను సాగు చేయలేదని డిడిస్ నంబర్ ఎ/436/ 1994గా దాదాపు 90 ఎకరాల భూమిని అసైన్మెంట్ క్యాన్సల్ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ మేరకు ఈసర్వే నెంబర్లలో భూములు సాగు చేసుకుంటున్న రైతులు ఆ వెంటనే మండల రెవెన్యూ అధికారికి తమ భూముల క్యాన్సల్ ఉత్తర్వులను పునఃసమీక్షించాలని తమ భూములను ప్రత్యక్షంగా క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలించాలని విన్నవించడంతో అప్పటి మండల రెవెన్యూ అధికారి కిందిస్థాయి అధికారుల రిపోర్టులపై ఆధారపడకుండా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి సాగులో ఉన్న ఈ భూములకు 4.4 1994 సంవత్సరంలో తాను క్యాన్సల్ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకొన్న ఉత్తర్వులు మరలా జారీ చేశారు. ఆ మేరకు భూమిని సాగు చేసుకునేవారు.

2011వ సంవత్సరంలో రెవెన్యూ రికార్డులు అడంగల్ వన్‌బి వెబ్‌లాండ్‌లో నమోదు చేసే సమయంలో భూమిలో సాగులో ఉన్న రైతుల పేర్లను నమోదు చేశారు. అయితే 2013 వచ్చిన మండల రెవెన్యూ అధికారి 1994లో అప్పటి మండల రెవెన్యూ అధికారి ఇచ్చిన భూముల క్యాన్సిల్ ఉత్తర్వులను 20వ సంవత్సరాల తర్వాత తన సొంత నిర్ణయంతో అమలుపరిచి వెబ్ లాండ్‌లో నమోదైన మండల వ్యాప్తంగా ఉన్న 90ఎకరాల భూమిని రైతులు ఎటువంటి నోటీసు ముందస్తు సమాచారం ఇవ్వకుండా వెబ్‌లాండ్ రికార్డుల నుంచి తొలగించారు. 1994లో భూమల క్యాన్సర్ ఉత్తర్వులను ఉపసంహరించుకున్న భూములను సైతం వెబ్‌లాండ్ నుంచి తొలగించడంతో రైతులు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆ మేరకు రెవెన్యూ డివిజన్ అధికారి భూములపై విచారణ జరిపి రైతులకు అనుకూలంగా ఉత్తర్వులు కూడా ఇచ్చి ఉన్నారు. అయితే ఆన్ లైన్ రికార్డ్ వన్‌బి, అడంగల్‌లో రైతుల పేర్లు నమోదు చేయడానికి రెవెన్యూ అధికారులు భారీగా డిమాండ్ చేయడంతో రైతులు మిన్నకుండిపోయారు. ఆన్‌లైన్ రెవెన్యూ రికార్డులలో అనాధనముగా నమోదు ఉండడంతో ఈ భూమిపై తిరుపతిలో సుదీర్ఘ కాలం పాటు పనిచేసిన ఓ ఆర్‌డిఓ కన్ను పడింది. ఆయన ఓ పెద్ద మంత్రికి అంతరంగికుడిగా ఉండడంతో పాటు కనకం సరసం ఉంటే ఏదానికైనా సిద్ధమనే పాల్పడే లక్షణాలున్న ఈ అధికారి మనసులో ఈ భూమిని కాజేయాలని ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ఆయన అక్కడ పనిచేస్తున్నప్పుడు ఈ పనిచేస్తే తనకి ఎక్కడ చుట్టుకుంటుందోనని భావించి తాను బదిలీ అయిన తర్వాత తాను అనుకున్న ప్రణాళికను పకడ్బందీగా అమలు పరచడానికి అన్ని రకాల హంగులు సిద్ధం చేశారు.

మాజీ సైనికులకు ఈభూమిని 2001- 2002 సంవత్సరంలో అసైన్మెంట్ చేసినట్టుగా బోగస్ రికార్డు సృష్టించారు. ఆ బోగస్ రికార్డుల మేరకు రేణిగుంట తహశీల్దార్ నిషేధిత జాబితా నుంచి ఈ భూములను తొలగించాలని ఆర్డీవోకు రిపోర్టు పంపినట్లు అప్పట్లో ఆర్డీవోగా ఉన్న ఈ అధికారి తహశీల్దార్ సిఫార్సుపై జిల్లా కలెక్టర్‌కు నిషేధిత జాబితా నుంచి తొలగించాలని సిఫార్సు చేసినట్లుగా ఉత్తర్వులు తయారు చేసి కలెక్టర్ కార్యాలయానికి సంబంధిత విభాగానికి పాత తేది 2022లో పంపించినట్లుగా సృష్టించారు. కలెక్టర్ కార్యాలయంలో ఈఫైలు లీగల్‌సెల్‌కు వెళ్లడంతో అక్కడి వ్యవహారాలు చూస్తున్న లీగల్ సెల్ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి ఈ మాజీ సైనికుల భూమి నిషేధిత జాబితా తొలగింపు ఫైలు పై కొర్రీలు వేయడంతో అతనిని అప్పటికప్పుడే మార్చివేసి డిప్యూటీ కలెక్టర్ స్థాయి నుంచి తహశీల్దార్‌గా రివర్షన్ పొంది తమ పెద్ద మంత్రి సిఫార్సుతో మరలా డిప్యూటీ కలెక్టర్‌స్థాయి పోస్ట్ తెచ్చుకున్న అధికారిని ఆస్థానంలో కూర్చోబెట్టారు. 2001- 2002 సంవత్సరంలో మాజీ సైనికుల పేరుతో అసైన్మెంట్ పొంది ఉంటే ఎందుకు ఈరోజు వరకు వారి భూమిని మాన్యువల్ రెవెన్యూ రికార్డులో నమోదు చేయకుండా వెబ్ లాండ్ కార్డులలో నమోదు కాలేదు ఈ రికార్డులు సృష్టించిన తిరుపతి పూర్వపు ఆర్‌డిఓకే తెలియాలి. అంతేగాక రేణిగుంట మండలం పైలట్ ప్రాజెక్టు కింద భూసంబంధిత రికార్డులను దాదాపు రెండు సంవత్సరాల కిందటే ల్యాండ్ సెటిల్మెంట్ అధికారులు స్కానింగ్ చేసి ఉన్నారు. ఇప్పుడు రికార్డులు ఏమాత్రం తారుమారు చేసినా స్కాన్ రికార్డుల్లో వాస్తవాలు బయటపడతాయి. ఈ విషయాలు ఎక్కడైనా బయట చెబుతాడేమోనని ఆలోచించిన ఈ పూర్వపు ఆర్డీవో సంబంధిత విభాగంలో ఉన్న మరొక కీలక వ్యక్తిని సైతం ఇతర విభాగానికి బదిలీ చేపించారు. ఈఫైలు బాగోతం ఎక్కడ బయటపడి తమ ఉనికికి ఎక్కడ ఇబ్బంది జరుగుతుందోనని భావించిన తిరుపతి పూర్వపు ఆర్డీవో తమ అనంగు మంత్రితో కలెక్టర్ జాయింట్ కలెక్టర్‌పై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చి యుద్ధ ప్రాతిపదికన ఈ 16ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని గత వారం రోజులుగా తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నట్లు కలెక్టరేట్ నుంచి విశ్వసనీయ సమాచారం. దాదాపు 60 కోట్ల నుంచి 70 కోట్ల వరకు విలువ చేసే భూములను కాజేసిపై అధికారులకు చిల్లరలు ముట్ట చెప్పి తమపని కానిచ్చుకోవడానికి పాపం ఈ ఆర్‌డిఓ ప్రతిరోజు చాలా శ్రమ పడుతున్నట్లు సంబంధిత శాఖలో భారీస్థాయిలో గుసగుసలు వినపడుతున్నాయి. కాగా తమ భూములను బోగస్ రికార్డులతో కాజేయాలని చూస్తున్న వ్యక్తులు తమ భూముల జోలికి వస్తే భోగస్ రికార్డులు సృష్టించిన పూర్వపు ఆర్డీవోతో పాటు ఇందులో సంబంధం ఉన్న అతని అంతరంగికులకు సైతం తగిన గుణపాఠం బహిరంగంగానే చెబుతామని భూ యజమానులు హెచ్చరిస్తున్నారు. జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ తమ దగ్గరికి నిషేధిత జాబితా తొలగింపు కోసం వస్తున్న ఈ బోగస్ దస్త్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి బోగస్ రికార్డులు సష్టించిన పూర్వపు ఆర్డిఓపైన అందుకు సంబంధిత ఆయన అంతరంగికుల పైన కఠిన చర్యలు కోవాలని భూముల రైతులు కోరుతున్నారు. కాగా జాయింట్ కలెక్టర్ ఈ భూముల నిషేధిత జాబితా తొలగింపుకు అభ్యంతరకరంగా మారుతున్నారన్న సమాచారంతో త్వరలోనే జాయింట్ కలెక్టర్ సైతం ఈ జిల్లా నుంచి బదిలీ చేయించడానికి ఈ పూర్వపు ఆర్డీవో పెద్దమంత్రికి సిఫార్సు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది.

'అ' శాఖమంత్రి సహకరంతోనే దుకాణ లైసెన్సులా?

- స్థానికుల బ్రతుకు జీవనంపై అధికారుల పరిహాసం
- అధికారపార్టీ వారికి దాసోహమంటున్న అటవీశాఖ

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం):

తిరుమల కొండనే నమ్ముకోని జీవనం సాగిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం యాత్రికులకు కల్పించే సౌకర్యాల అవసరాలకు వారి బతుకు జీవన స్థానాన్ని ఓ చోటు నుండి మరో చోటుకు మార్చుతున్నా శ్రీవారి యాత్రికుల పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి నేడు అధికార పార్టీకి చెందిన వారు వారి పరపతిని ఉపయోగించి తీసుకొస్తున్న అధర్మ లైసెన్సుల కారణంగా కాలినడక 7వ మైలు వద్ద దుకాణదారులు తీవ్రఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు తాజాగా 30మందికి అటవీశాఖ భూపరిధిలో దుకాణాలను నిర్వహించుకునేందుకు అనుమతులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులపై సర్వత్రా తీవ్రవిమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికులను కాదని స్థానికేతరులకు దుకాణాలను నిర్వహించుకునేందుకు అనుమతులు ఎలా ఇస్తారని స్థానిక దుకాణాల నిర్వహకులు మీడియాతో వాపోయారు. దుకాణాల కేటాయింపుల వెనుక జిల్లాలోని 'అ' శాఖమంత్రి అండదండలతోనే సాగినట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో పాటుగా 'అ' శాఖమంత్రి వ్యక్తిగత కార్యదర్శి 'కారాం' హస్తం ఉన్నట్లుగా విమర్శలు ఉన్నాయి. ఇంకేం 'అ' శాఖమంత్రి, ఆ 'కారం'లే తలిస్తే జరిగిందా ఉందా. అర్హులుగా ఉన్న తిరుమల స్థానికులను కాదని వారనుకున్న వారికి దుకాణాలు నిర్వహించేందుకు ఆదేశాలు ఇచ్చేశారు.



Trade
Tea, Coffee, Bajji, Bonda, Biscuit, Sweet corn & Fancy
Tea, Coffee, Bajji, Bonda, Biscuits, Sweet corn, Cool Drinks, Ice Cream, Tender Coconuts & Fancy

30 మందికి జారీ చేసిన అనుమతుల్లో అమ్ముకొవడానికి సూచించిన ఆహార పదార్థాలు

వన్యప్రాణి రక్షణ భాధ్యత ఎవరిది?

తిరుమల కాలినడక మార్గంలో దశాబ్దాలుగా ఎన్నడూలేని విధంగా శ్రీవారి భక్తులపై చిరుత పులులు దాడి చేసి చంపే ఘటనలు జరిగాయి. ఈ సంఘటన యావత్ ప్రపంచమంతా ఉన్న శ్రీవారి భక్తులను, యాత్రికులను, ఇటు స్థానికులను, టీటీడిని కలవరపాటుకు గురిచేసింది. చిరుతల నుండి శ్రీవారి భక్తులను రక్షించేందుకు టీటీడి ఛైర్మన్‌గా ఉన్న భూమన కరుణాకర రెడ్డి కాలినడక భక్తులను గుంపులుగా వెళ్ళమనడం, చేతికి కర్రలివ్వడం చేశారు. మరో వైపు అటవీశాఖ అధికారులు 7వ మైలు ప్రాంతంలో సంచరిస్తున్న పులులను ట్రాప్ కెమెరాల సహయంతో గుర్తించి ఆయా ప్రదేశాల్లో బోన్లు ఏర్పాటు చేసి పట్టుకుని సురక్షిత దట్టమైన అటవీ ప్రాంతంలో విడిచి పెట్టేవారు. ఈ క్రమంలో వన్యప్రాణుల నుండి శ్రీవారి భక్తుల శాశ్వతరక్షణ కోసం వైల్డ్ లైఫ్ ఇన్సిట్యూట్ ఆఫ్ ఇండియా వారు అలిపిరి కాలినడక మార్గాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అప్పట్లో కాలినడక మార్గంలో జింకలకు భక్తులు మెట్లమార్గంలో విక్రయించే తినుబండారాలు వేస్తున్నారని, వాటి మిగులు ఆహారాన్ని వెతుక్కుంటూ చిన్నపాటి జంతువులు వస్తున్నాయని, వాటి కోసం చిరుతలు రావడం జరుగుతోందని అటవీశాఖ జిల్లా అధికారి సతీష్‌రెడ్డి మీడియాకు తెలిపారు. చిరుతల దాడి ఉత్కంఠ కొనసాగుతున్న రోజుల్లో చిరు వ్యాపారులు ఎవ్వరూ తినుబండారాలు విక్రయించరాదని ఇటు టీటీడీ, అటవీ శాఖ సంయుక్తంగా ఆదేశాలు జారీ చేశారు కూడా, మరి తాజాగా 30 మందికి దుకాణాలు నిర్వహించుకునేందుకు అనుమతులు ఇచ్చిన దానిలో తినుబండాలు అమ్ముకోవచ్చుని ఎలా అనుమతులు జారీ చేసారో అధికారులకే తెలియాలి. ఇప్పుడు అటవీశాఖ ప్రదాన కర్తవ్యాలలో ఒకటైన వన్యప్రాణి రక్షణ ఎవరిది..?.

కాలినడక మార్గంలో ఏర్పాటవుతున్న కొత్త దుకాణాలు

శాశ్వత పరిష్కారం చూపకనే...

తిరుమల కాలినడక మార్గంలో చిరుతలు, ఎలుగుబంటిలతో పాటు వన్య ఆధారిత ప్రాణులు సంచరిస్తున్న నేపథ్యంలో శ్రీవారి భక్తుల రక్షణకు ఎటువంటి శాశ్వత పరిష్కారం చూపకనే అటవీశాఖ అధికారులు ఇలాంటి దుకాణాల మంజూరు చేశారన్న ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. అసలే వ్యాపారాలు అంతంత మాత్రంగానే సాగుతున్న పరిస్థితుల్లో అటవీశాఖ చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయని స్థానిక దుకాణ దారులు వాపోతున్నారు. భారిగా లావాదేవీలతోనే 30 దుకాణాలకు అనుమతులు వచ్చాయని ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఈ విమర్శల నేపథ్యంలో 'అ' శాఖమంత్రి, అటవీశాఖ అధికారులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

పిఎస్ఎల్వి ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ భవనం ప్రారంభం

జాతికి అంకితం చేసిన ప్రధాని మోడీ

ప్రజాశక్తి- సూళ్లూరుపేట : తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ సందర్శనకు వచ్చిన ప్రధాన మంత్రి నరేద్ర మోడీ సుమారు రూ.1800 కోట్ల ఖర్చుతో నిర్మించిన మూడు ప్రధానమైన అంతరిక్ష ప్రయోగాలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించారు. ప్రధాని ప్రారంభించిన వాటిలో శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్లో 'పీఎస్ఎల్వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ' భవనం కూడా ఉంది. దీనితో పాటుగా మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో 'సెమీ క్రయోజనిక్స్ ఇంటిగ్రేటెడ్ ఇంజిన్ అండ్ స్టేజ్‌టెస్ట్ ఫెసిలిటీ' విఎస్ఎస్‌సి వద్ద 'ట్రైసోనిక్ విండ్ టన్నెల్' కూడా ప్రధాని చేతులు మీదుగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. శ్రీహరికోటలోని పీఎస్ఎల్వీ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీ (పీఐఎఫ్) అందుబాటులోకి రావడంతో పీఎస్ఎల్వీ ప్రయోగాల సంఖ్యను పెంచడానికి దోహద పడుతుంది. ఏడాదికి 6 నుంచి 15 ప్రయోగాలు జరపడానికి వెసులుబాటు కలిగింది. ఈఅత్యాధునిక సదుపాయం ద్వారా ప్రైవేటు అంతరిక్ష సంస్థలు రూపొందించిన ఎస్ఎస్ఎల్వి ఇతర చిన్న ప్రయోగ వాహనాల ప్రయోగానికి కూడా ఉపయోగపడుతుంది. ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ సారథ్యంలో గగన్యాన్ ద్వారా అంతరిక్షంలోకి పంపడానికి భారత్ సిద్ధం చేసిన నలుగురు ఆస్ట్రోనాట్‌లను కూడా ఈ సందర్భంగా ప్రధానికి పరిచయం చేయడం జరిగింది.

9న జాతీయ లోక్ అదాలత్: సీనియర్ సివిల్ జడ్జి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మార్చి 9 నుండి మార్చి 16వ తేదీ వరకు రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి సి ఎస్ రాఘవేంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి, ఇతర సెలవులు వరుసగా రావడం వల్ల రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ మార్పు చేసిందని తెలిపారు. కక్షిదారులు, న్యాయవాదులు, ప్రజలు మార్చి 16న జాతీయ లోకాదాలతను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ మార్పును గమనించి సహకారం అందించాలన్నారు.

గూడూరు టౌన్ : మార్చి 9 వ తేదీన జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ ను మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వాయిదా వేస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ , 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మి పర్వీన్ సుల్తానా బేగం మంగళవారం తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ లో పెండింగ్ లో ఉన్న కేసులను పరిష్కరించు కోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షి దారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఫల సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు డిఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ఫల సరుకుల మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దాత మూలి హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు సాయం చేయడం ఎంతో తృప్తిగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ల సిరి గోపాల్ రెడ్డి , ఆడిటర్ రామ్మోహన్ రావు, నాసిన నాగులు, చోళవరం గిరిబాబు, రాఘవరెడ్డి , సుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ జన్మదినం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని డివిజన్ పంచాయతీరాజ్ కార్యాలయంలో డిప్యూటీ ఈఈ ఇ రవీంద్ర కుమార్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ డిప్లొమో ఇంజనీర్ల గౌరవ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ భవిష్యత్ లో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ఈఈ గిరీనాథ్, రామచంద్రయ్య, వెంకటేశ్వర్లు , ఇలియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక 5 వ వార్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా మంగళవారం ఆ పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి బాబు సూపర్ సిక్స్ కరపత్రాలు అందిస్తూ, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, రాష్ట్ర తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్ డీజీ ధనపాల్, కౌన్సిలర్ కేశవ చారి, మై మాజీ వైస్ ఛైర్మన్ డి ఎస్ గణేష్, చిత్తూరు పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగం రెడ్డి, చిత్తూరు పార్లమెంటరీ తెలుగు యువత అధికార ప్రతినిధి చినబాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

37వ జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్ర విభాగంలో 37వ జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు రూరల్: గూడూరు రెండవ పట్టణంలోని వి. యస్. ఆర్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా పర్యావరణ - పరిశుభ్రత, చెట్ల ప్రాముఖ్యత , పరిరక్షణ గురించి అవగాహన కల్పించడంతో విద్యార్థులు చక్కని మొక్కలు నాటించారు. గూడూరు పట్టణంలోని సర్వోదయ రావు పేటలోని ప్రతి ఇంటికి విద్యార్థులు వెళ్లి, చెట్లు పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఇంటింటికి విద్యార్థులు మొక్కలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ .కిరణ్ కుమార్ , డాక్టర్ శాంతి లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం నందిమండలం బాలకృష్ణ , అన్నపూర్ణ ప్రిన్సిపాల్ శాంత కుమార్ , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏసిఎంఎ రద్దు చేయాలి: టిడిపి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : జగన్ క్రికెట్ అసోసియేషన్ గా మారిపోయిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ను వెంటనే రద్దు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఏసీఏను రద్దు చేయాలంటూ మంగళవారం టీడీపీ ఆధ్వర్యంలో స్థానిక ఏపీ సీడ్స్ కూడలి వద్ద నిరసన తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.శంకరరావు మాట్లాడుతూ ఎంతో హుందాగా నిర్వహించాల్సిన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యకలాపాలను గడచిన నాలుగు సంవత్సరాల కాలంలో విజయసాయి రెడ్డి గ్యాంగ్ భ్రష్టు పట్టించారని ఆరోపించారు. భారత క్రికెటర్ హనుమ విహారిని వేధించి, జట్టు నుంచి తొలగిపోయేలా చేసి తన అనుచరుడిని ఆంధ్రా క్రికెట్ జట్టులో చేర్చుకున్నారని విమర్శించారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో నిందితుడైన శరత్ చంద్రారెడ్డిని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నియమించడం జగన్ రెడ్డి ధ్వంద నీతికి నిదర్శనమన్నారు. కోట్లాది మంది క్రికెట్ అభిమానుల భావోద్వేగాలను సొమ్ము చేసుకుంటూ, క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా ఎన్నో అక్రమాలకు పాల్పడుతున్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ గుర్తింపును రద్దు చేసి, హనుమా విహారి పట్ల అవమానకరంగా ప్రవర్తించిన ఏసిఏ కార్యవర్గం పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నారా లోకేష్‌తో పులివర్తి నాని భేటీ

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ టిడిపి అధ్యక్షుడు, చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని మంగళవారం చెన్నై లో శ్రీ వెంకటాచలపతి ఆలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీరామానుజర్ ఆలయానికి ప్రత్యేక పూజలు కోసం నారా లోకేష్ తో పాటు పులివర్తి నాని కూడా వెళ్లారు. నారా లోకేష్ కి పులివర్తి నాని పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. నారా లోకేష్‌తో కలిసి పులివర్తి నాని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఉమ్మడి చిత్తూరు జిల్లా పార్టీ పరిస్థితులను నారా లోకేష్ అడిగి తెలుసుకున్నారని పులివర్తి నాని తెలిపారు.

శ్రీవారి సేవలో శశికళ

తిరుమల- ప్రజాశక్తి: తిరుమల శ్రీవారిని జయలలిత సన్నిహితురాలు శశికళ దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించు కున్నారు. అనంతరం వేద పండితులు రంగనాయకుల మండపంలో ఆశీర్వచనాలు ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పరీక్షల నిర్వహణ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి: ఎస్టియు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రానున్న పదవ తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణలో దీర్ఘకాలిక వ్యాధులు, గుండె జబ్బులు, మూత్రపిండాల వ్యాధులతో చికిత్స పొందుతున్న వారికి, అంగవైకల్యం, చంటి పిల్లలు కలిగిన మహిళా ఉపాధ్యాయులకు, గర్భిణులకు, పరీక్షల నిర్వహణ విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.శేఖర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఎన్నికల విధులను కూడా మినహాయింపు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్‌ను కోరామని, ఆ మేరకు కలెక్టరేట్ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఎన్నికల విధుల నుండి మినహాయింపుకు ఉపాధ్యాయులు, ఉద్యోగుల నుండి దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు చేశారన్నారు. అంతకుముందు తిరుపతి జిల్లా ఎస్టియు శాఖకు ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర నాయకులు గాజుల నాగేశ్వరరావు, ధనంజయ నాయుడుల ఆధ్వర్యంలో డీఈవో ఇతర అధికారులకు పరిచయం చేశారు. రాష్ట్ర, జిల్లా నాయకులు రమేష్ బాబు, జగన్నాథం, కటారి మోహన్, రేణుకా దేవి, శారదమ్మ, దేవేంద్ర, హరికష్ణ, గుమ్మడి మురళి, రమేష్, మిఠాయి వేణుగోపాల్, మునికృష్ణమ నాయుడు, దేవేంద్ర యాదవ్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉపాధి హామీలో భారీ అవినీతి

- రూ.5,90,48,546 మంజూరు
- రూ.94,927 రికవరీ, పెనాల్టీ
- జాబ్ కార్డు ఒకరిది.. డబ్బులు మరొకరివి
- రైతులకు ఉపయోగపడని ఉపాధి హామీ
- తనిఖీ సభలో కనిపించని కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు
- 17వ సామాజిక తనిఖీలో నిజాలు బహిర్గతం

సామాజిక తనిఖీ సభలో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాస్ ప్రసాద్

ప్రజాశక్తి - పిచ్చాటూరు (సత్యవేడు): పిచ్చాటూరు మండలంలో గత ఏడాది నిర్వహించిన ఉపాధి హామీ పనుల్లో భారీ అవినీతి చోటు చేసుకుంది. మొత్తం ఐదుకోట్ల 91 లక్షల రూపాయల మేర మంజూరు కాగా ఒక్క పులిగుండ్రం పంచాయతీలో 47,51,527 రూపాలు మాత్రమే మస్టర్లు వేసి ఖర్చు చేశారు. రైతులకి మేలు చేయాల్సిన క్షేత్ర సహాయకులు చెరువులో అధిక పనులు చేసి ప్రభుత్వ ధనాన్ని వృథా చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫీల్డు అసిస్టెంట్లు సైతం సమావేశానికి గైర్హాజరయ్యారు. అధికారులు మంగళవారం నిర్వహించిన 17వ సామాజిక తనిఖీలో ఇంకా పలు ఆసక్తికర వాస్తవాలు వెల్లడయ్యాయి. చివరకు అధికారులు 94 వేల927 రూపాయలు మాత్రం నామమాత్రపు రికవరీ, పైనాల్టీ విధించడం కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా వుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నామమాత్రపు తనిఖీ

పిచ్చాటూరు మండలంలో మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏడు రోజులుగా సోషల్ ఆడిట్ తో పదిమంది డిఆర్పిలు బృందంగా ఏర్పడి గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేస్తున్నారు. ఉపాధి హామీ సిబ్బంది మస్టర్లను, కూలీలను ఇంటింటికి వెళ్లి వారు చేసిన పనుల గురించి ఆరా తీసి వారి జాబ్ కార్డులు నమోదు చేసిన బిల్లులు సొమ్ము తీసుకున్నారా? లేదా అని పూర్తి వివరాలు సేకరించాల్సి వుంది. అయితే ఇందుకు విరుద్ధంగా ఫీల్డు అసిస్టెంట్లతో కుమ్మక్కై, ఎక్కడో ఒకచోట చేరి వారు ఇచ్చిన సమాచారం సేకరించి సామాజిక తనిఖీ సమావేశంలో నామమాత్రంగా చదివి వినిపించి చేతులు దులుపుకున్నారు. జాబ్ జాబ్ కార్డులు ఒకరిది బిల్లులు మరొకరిది.. ఇలా మండల స్థాయిలో భారీ ఎత్తున ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్లు నమోదు చేసి డబ్బులు కాజేశారని వెల్లడైంది. ఈ ఆడిట్లో కొంత మేరకు డిఆర్పిలు పీడీ చెంతకు సమస్యలు తీసుకొచ్చారు. స్పందించిన జిల్లా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ జాబ్ కార్డు లేని వారికి కొత్తగా జాబ్ కార్డు మంజూరు చేయాలి.. కానీ ఇలా మరొకరిని తీసుకొచ్చి పనులు చేయించడం చట్ట రీత్యా నేరమని ఉపాధి ఫీల్డర్ తో పాటు అప్పుడు పని చేసిన ఏపీవో సుధాకర్ పైనాల్టీ విధించారు. ఇకపై ఇలాంటి తప్పులు చేస్తే ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు ఏపీఓపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని పులిగుండ్రం ఫీల్డ్ అసిస్టెంట్ 32 పనులు చేపట్టి 47,51,527 రూపాయలు ఖర్చుపెట్టి మస్టర్లు వేశారు. కానీ మంగళవారం సామాజిక తనిఖీ మండల సమావేశానికి కూడా ఫీల్డు అసిస్టెంట్లు రాకపోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. చెట్లు పెంపకం, మండల స్థాయిలో పూర్తిగా బిల్లులు చేశారు. కానీ ఒక్క చెట్టు కూడా బతకలేదని సమావేశంలో డిఆర్పిలు చక చక చదివేశారు. రైతులకి మేలు చేయవలసిన క్షేత్ర సహాయకులు ఎక్కువ పనులు చెరువులో చేసి ప్రభుత్వ ధనాన్ని వృథా చేశారని రైతులు ఆవేదన చేస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు చేసిన పనులు వర్షాకాలంలో పూర్తిగా మునిగిపోయి సోషల్ ఆడిట్ చేసేందుకు వచ్చిన డిఆర్పిలను చెరువులో తీసుకెళ్లి చూపించి 'పనులు చేశాము వర్షం వచ్చింది.. మునిగిపోయాయి..' అని ఒక చిరునవ్వుతో సమాధానం చెప్పేసి దాటేశారు. రైతులకు మేలు చేస్తూ ప్రభుత్వ ఆస్తులను కాపాడుతూ కూలీలకు పనులు కల్పిస్తూ ఆర్థికంగా పైకి తీసుకురావాల్సిన అధికారులు ఇలా అవినీతికి పాల్పడుతూ పథకాన్ని నీరు కారుస్తున్నారని రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంబుడ్స్ మెన్ రామానాయుడు, జిల్లా విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, సింగిల్ విండో ఛైర్మన్ హరిచంద్ర రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ నాయుడు, స్థానిక సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, కిరణ్ కుమార్, ఏపీవో నాగభూషణం, ఏపిఎం వనిత, ప్రజా ప్రతినిధులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పలు కీలక అంశాలకు ఎస్వియూ పాలకమండలి ఆమోదం

సమావేశంలో చర్చిస్తున్న ఎస్వియూ పాలక మండలి సభ్యులు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పాలకమండలి సమావేశం ఉపకులపతి ఆచార్య వి. శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం ఉపకులపతి చాంబర్లో నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి కార్యాలయం నుండి ఉదయం 11 గంటల నుండి 2 గంట మధ్య జరిగిన ఈ సమావేశంలో ఆనేక అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు. అమరావతి నుండి ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య హేమచంద్ర రెడ్డి, ఉన్నత విద్యాశాఖ ,ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శులు ఆన్లైన్లో పాల్గొనగా ,మిగిలిన పాలకమండలి సభ్యులు విసి కార్యాలయం నుండి పాల్గొన్నారు. పలు కీలక అంశాలకు పాలకమండలి ఆమోదం తెలిపినట్లు యస్వియూ రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న 53 మంది బోధన సిబ్బందికి సిఏయస్ కు సంబంధించిన ఉద్యోగోన్నతిపై చర్చించి పాలకమండలి ఆమోదం తెలిపింది. దీంతో వారు ఆచార్యులుగా , సహ ఆచార్యులుగా ఉద్యోగోన్నతి పొందినట్లయింది. విశ్వవిద్యాలయ బోధనేతర సిబ్బంది వయోపరిమితిని 60 ఏళ్ల నుండి 62 ఏళ్లకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 10ని పాలకమండలి ర్యాటిఫికేషన్ చేసింది. పలు ఇంజనీరింగ్ పనులు, భవన నిర్మాణాలకు పాలకమండలి ఆమో దం తెలిపింది. కొన్ని నూతన కోర్సులకు సంబంధించి చర్చించా రు. అవసరమైన వాటిని అమలు చేసేందుకు పాలకమండలి అనుమతించింది. ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు వివిధ శాఖల్లో గోల్డ్ మెడల్ ఇవ్వడానికి దాతలు ముందుకు రావడంతో విశ్వవిద్యాలయం పక్షాన పలు గోల్డ్ మెడల్ ఇచ్చేందుకు ఇ సి ఆమోదం తెలిపింది. విశ్వవిద్యాలయ ఆర్థిక విషయాలను చర్చించేందుకు, పలు నిర్ణయాలు తీసుకునేందు ఒక ఆర్థిక సలహా మండలిని ఐదు గురు సభ్యులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు ఆచార్య సుగుణమ్మ, ఆచార్య పద్మనాభం, ఆచార్య సుమకిరణ్, డాక్టరు మంజుల, డాక్టరు మొహిద్దీన్ బాషా, డాక్టరు సంధ్యారాణి డాక్టరు సురేంద్రనాథ్ రెడ్డి, నారాయణ బాబు, జ్యోతి పాల్గొన్నారు.

రాయలసీమాభివృద్ధికి మార్గం తిరుపతి రాజధాని: మాజీ ఎంపీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాయలసీమ ప్రాంతం సమగ్ర అభివృద్ధి చెందాలంటే ఏకైక మార్గం తిరుపతి రాజధాని కావాలని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ వ్యాఖ్యానించారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనంతపురం నుండి తిరుపతి వరకు దాదాపు 300 కిలోమీటర్ల మేర ఎత్తైన కొండలు, రాళ్ల తప్ప ఇంకేమీ కనబడడం లేదని, 70 స్వతంత్రాల కాలంలో నీలం సంజీవరెడ్డి మొదలుకొని ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్ రెడ్డి వరకు రాయలసీమ ప్రాంతానికి ఏమీ చేయలేదన్నారు. ప్రజాధనాన్ని దోచుకుంటూ వేల కోట్లు వెనకేసుకుని హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో హాయిగా బతుకుతున్నారన్నారు. రాయలసీమలో పేదరికం పోవాలన్నా, పేదల ఆకలి తీరాలన్న ప్రజలందరూ సమృద్ధిగా అభివృద్ధి చెందాలన్నా తిరుపతి రాజధాని కావాలన్నారు. చంద్రబాబు, జగన్మోహన్ రెడ్డి తిరుపతి రాజధాని పట్ల తమ వైఖరిని స్పష్టం చేయాలన్నారు. మార్చి 1న తిరుపతి వేదికగా జరిగే బహిరంగ సభలో మరిన్ని గ్యారంటీ స్కీములను ప్రకటిస్తామన్నారు. ఈ భారీ బహిరంగ సభకు తిరుపతి ప్రజలు, కాంగ్రెస్ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని చింతామోహన్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నగర అధ్యక్షులు యార్లపల్లి గోపి, రవి, తేజోవతి, శాంతి యాదవ్, మునిశోభ, జావేద్ పాల్గొన్నారు.

'రాజన్న ఫౌండేషన్' విద్యా సంస్థలకు బెస్ట్ అవార్డు

అవార్డు అందుకుంటున్న రాజన్న ఫౌండేషన్ విద్యా సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి -రేణిగుంట: గల్లా రామచంద్ర నాయుడు, వారి కుటుంబ సభ్యుల ద్వారా నిర్వహిస్తున్న రాజన్న ఫౌండేషన్ ద్వారా గత 27 సంవత్సరాలుగా గ్రామీణ విద్యార్థిని విద్యార్థులకు సరసమైన ధరలకు నాణ్యమైన విద్యాభ్యాసాన్ని అందిస్తున్న అమర రాజా సంస్థల గ్రూప్ లో భాగమైన రాజన్న ఫౌండేషన్ విద్యా సంస్థలకు 'బెస్ట్ ఎడ్యుకేషన్ సపోర్ట్ ఇనిషియేటివ్ ఆఫ్ ది ఇయర్ 2024' అవార్డు లభించింది. ఢిల్లీలో పార్క్ హయత్ హోటల్లో బ్రాండ్ హానాక్ వారిచే ఇండియన్ సోషల్ ఇంపాక్ట్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో మంగళవారం ఈ అవార్డుని రాజన్న ఫౌండేషన్ హెడ్ సతీష్ అందుకున్నారు. ఈ అవార్డుని అందుకోవడం పట్ల రాజన్న ఫౌండేషన్ సంస్థల ఛైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా అనేక రకాల సేవా కార్యక్రమాల్ని గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగిస్తున్నామని అందులో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు ప్రదేశాలలో విద్యా సంస్థలు నెల కొల్పి వందల మంది గ్రామీణ విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నా మన్నారు. తమ సేవా కార్యక్రమాలకి గుర్తింపుగా ఈ అవార్డు అందుకున్నం దుకు ఎంతో సంతోషంగానూ, ఇంకా సేవా కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లడానికి స్ఫూర్తి నందిస్తుందని, ఈ అవార్డుని అందుకోవడానికి సహకరించిన రాజన్న ఫౌండేషన్ సిబ్బందికి విద్యార్థిని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలుపు తున్నామన్నారు.

పాలీసెట్‌కు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి: ప్రిన్సిపాల్

ప్రజాశక్తి -సత్యవేడు: పాలిటెక్నికల్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాల కోసం రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నిర్వహించనున్న 2024 పాలీసెట్ ప్రవేశ పరీక్షలకు ఆన్‌లైనులో దరఖాస్తు చేసుకోవాలని తిరుపతి జిల్లా సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషాదేవి పేర్కొన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పదవ తరగతి ఉత్తీర్ణులు అయిన వారు పాలిసెట్ ప్రవేశ పరీక్షలకు అర్హులన్నారు. ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ఆన్‌లైనులో దరఖాస్తు చేసుకోవడానికి ఫిబ్రవరి 20 నుంచి ప్రారంభమై ఏప్రిల్ నాలుగో తేదీతో గడువు ముగుస్తుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ సెంటర్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏప్రిల్ 27వ తేదీన పాలీసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థిని, విద్యార్థులందరికీ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ముగిసిన వెంటనే ఏప్రిల్ ఒకటి నుంచి స్థానిక పాలిటెక్నికల్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. దీంతో పాటు శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు అందరికి మెటీరియల్స్ అందిస్తామన్నారు. మరిన్నివివరాల కోసం హెచ్‌టిటిపి ఎస్//అండ్‌బిటిఇటి. ఏపి.జివోవీ.ఐఎన్‌వెబ్‌సైటును సంప్రదించాలన్నారు. పాలిటెక్నికల్ డిప్లమో కోర్సులు పూర్తి చేసుకుంటున్న ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలు అపారంగా ఉన్నాయన్నారు. పదవ తరగతి పూర్తి చేస్తున్న విద్యార్థులు అందరూ సాంకేతిక విద్యాశాఖ నిర్వహిస్తున్న పాలిసెట్ ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. దీనికి సంబంధించి డాక్టర్ కృష్ణంరాజు(8179433557),లోకేశులు(9492978378) మొబైల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఆనం వెంకటరమణారెడ్డి ఆరోపణలు అవాస్తవం: టిటిడి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: దాతల విజ్ఞప్తి మేరకు వారు ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానంలో ఈ నెల 25వ తేదీ టీటీడీ ఛైర్మన్, ఈవో ముంబయికి వెళ్లి శ్రీవారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారని, ఇందుకోసం టీటీడీ ఎలాంటి ఖర్చు చేయలేదని టీటీడీ యాజమాన్యం ప్రకటించింది. తిరుమలలో పది ఎలక్ట్రిక్ బస్సులను దాత విరాళంగా ఇచ్చారని, ఈ అంశంలో బోర్డు సభ్యులు నాగసత్యంకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ విషయాలకు సంబంధించి టిడిపి నేత ఆనం వెంకటరమణారెడ్డి ఆరోపణలు చేసినట్లు ఒక దినపత్రికలో ప్రచురించిన వార్త పూర్తిగా అవాస్తవమని వెల్లడించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే విజ్ఞప్తి మేరకు హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా, దాతల విభాగంలో ఫిబ్రవరి 25వ తేదీన టీటీడీ ముంబయిలో శ్రీనివాస కళ్యాణోత్సవం ఏర్పాటు చేసింది. లక్ష మంది భక్తుల సమక్షంలో నిర్వహించే కళ్యాణోత్సవానికి టీటీడీ తరఫున ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని, ఈవో ఏవి.ధర్మారెడ్డిని దాతలు ఆహ్వానించారు. దాత సాయంతోనే ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. టీటీడీ 10 ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసిందని, ఆ సంస్థకు నాగసత్యం డైరెక్టర్ అని ఆరోపించడం సత్యదూరం. వాస్తవానికి మేఘ కృష్ణారెడ్డి తన ఒలెక్ట్రా సంస్థ ద్వారా 10 ఎలక్ట్రిక్ బస్సులను భక్తుల సౌకర్యార్థం టీటీడీకి విరాళంగా అందించారు. నాగ సత్యంకు ఆ సంస్థకు ఎలాంటి సంబంధం లేదు. అయితే దినపత్రికలో వచ్చిన వార్తలో బస్సుల సరఫరాలో వాటా కోసమే నాగసత్యంకు ధర్మకర్తల మండలి పదవి కట్టబెట్టారని ఆరోపించడం సత్యదూరం. టీటీడీకి ఉచితంగా వచ్చిన బస్సులపై కూడా అవాస్తవాలను ప్రచారం చేయడం దాతల మనోభావాలను దెబ్బతీయడమే అవుతుందని టిటిడి యాజమాన్యం పేర్కొంది.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: మార్చ్ 3వ తేది నిర్వహించనున్న పల్స్ పోలియోను విజయవంతం చేయాలని తిరుపతి జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీహరి, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ ఆరోగ్యాధికారి డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి పేర్కొన్నారు. పల్స్ పోలియో ఏర్పాట్లపై తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో మంగళవారం ఆరోగ్య కార్యదర్శులు, ఆశా వర్కర్లు, అంగన్ వాడీ సిబ్బందితో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ పర్యవేక్షణలో జరిగే పల్స్ పోలియోలో భాగంగా 3వ తేది 23 రూట్లలలో 207 పల్స్ పోలియో బూత్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పల్స్‌పోలియోకు అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఐ.ఓ శ్రీనివాస రెడ్డి, డిపిఎంఓ శ్రీనివాసులు, యు.పి.హెచ్.సి మెడికల్ ఆఫీసర్లు మోహన్, ఆరోగ్య కార్యదర్శులు, అశా వర్కులు, అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి -నాగలాపురం : నాగలాపురం మండలం సురుటుపల్లి శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయంలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై పలు శాఖల అధికారులతో ఆలయ ధర్మకర్తల మండలి సమీక్ష సమావేశం నిర్వహించింది. మంగళవారం ఆలయ ట్రస్ట్ బోర్డు కార్యాలయంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, కార్యనిర్వహణాధికారి కోటిరామచంద్ర రెడ్డి సమీక్ష జరిపారు. సమీక్షలో నాగలాపురం ఎస్ఐ ఓబయ్య,విద్యుత్ శాఖ ఏఈ జయసాయి,లైన్మాన్ రవి,వీఆర్వో శేఖం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవ వేడుకలను పగడ్బందీగా నిర్వహించ డానికి అన్ని చర్యలు తీసుకున్నా మన్నారు. ఈ నెల 29 నుంచి మార్చి 10 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవ వేడుకలు జరుగు తుందన్నారు. దర్శనంలో సామాన్య భక్తులకు తొలి ప్రాధాన్యత కల్పిస్తా మన్నారు. ఇందుకోసం భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా సజావుగా స్వామి దర్శనం చేసుకునేలా క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆలయ ఛైర్మన్ బాలాజీ రెడ్డి, సత్యవేడు సిఐ దివాకర్ రెడ్డి,ఎస్సై ఓబయ్య తదితరులతో కలిసి ఆలయంలో క్యూ లైన్ లో ఏర్పాటు,స్వామి దర్శనం మార్గం, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలిం చారు.అనంతరం సీఐ దివాకర్ రెడ్డి స్వామివారి సేవలో పాల్గొ న్నారు. ఈ సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఆనంద య్యా, మునివేలు, సురేష్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో వాచ్‌మెన్ మృతి చెందిన సంఘటన మంగళవారం తిరుపతిలో చోటుచేసుకుంది. తిరుపతి రూరల్ పోలీసులు కథనం మేరకు పాకాల మండలం, దిన్నిపేట గ్రామానికి చెందిన వెంకటాద్రి, భార్య పార్వతి కుమారుడితో కలిసి పశుపతి అపార్టుమెంట్లో వాచెమెన్‌గా పనిచేస్తున్నారు. వెంకటాద్రి సోమవారం రాత్రి (42) పాల ప్యాకెట్ కోసం రోడ్డుపై వెళుతుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో తీవ్ర గాయమై కుప్పకూలాడు. స్థానికులు గమనించి అతడిని హుటాహుటిన తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం తెల్లవారుజామున ఆయన మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలను సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ట్రాక్టరు ఢీకొని ఇద్దరు మృతి

ప్రజాశక్తి -రేణిగుంట : ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన రేణిగుంట మండలంలోని మొలగమూడి వద్ద చోటుచేసుకుంది. ఇద్దరు వ్యక్తులు పల్సర్ బైక్ పై నారాయణవనం నుండి తిరుపతికి బయలుదేరారు. తిరుపతి- చెన్నయ్ జాతీయ రహదారిలోని మొలగమూడి వద్దకు చేరుకోగానే ట్రాక్టర్ రివర్స్ చేస్తుండగా నిర్లక్ష్యం కారణంగా బైకును ఢీ కొంది. ఈ ప్రమాదంలో బైక్ పై వస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందినవారు నారాయణవనంకు చెందిన హరీష్ (22), అంజి మేడుకు చెందిన రామ్ చరణ్ (17) గా పోలీసులు గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఆసుపత్రికి తరలించారు. గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి సంఘటన స్థలానికి పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీలోనే స్థలాలు ఇవ్వండి: సిపిఎం

వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని పేద ప్రజలకు ఇచ్చిన జగనన్న ఇళ్ల పట్టాలకు స్థానికంగానే స్థలాలు చూపాలని కోరుతూ మంగళవారం సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు వేణుగోపాల్, బుజ్జి ఆధ్వర్యంలో తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో పరిపాలనాధికారికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వేణుగోపాల్, బుజ్జి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంతో వైసిపి ప్రభుత్వం జగనన్న నవరత్నాల్లో భాగంగా ఇళ్ల పట్టాలను ఇవ్వడానికి నిర్ణయించిందని, అయితే కొన్ని ప్రాంతాల్లో పట్టాలు మాత్రం ఇచ్చి స్థలాలు చూపలేదని విమర్శించారు. ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీలో దాదాపు 2,500 కు పైగా జగనన్న ఇళ్ల పట్టాలు ఇచ్చారని, మూడేళ్లు కావస్తున్న స్థలాలు చూపకపోవడంతో పోరాటాలు చేసామన్నారు. ఉమ్మడి శెట్టి పల్లె పంచాయతీలో జగనన్న ఇళ్ల పట్టాలు పొందిన వారికి ఎక్కడో సుదూర ప్రాంతమైన చిందేపల్లిలో స్థలాలు ఇవ్వడం సరికాదని, మంగళం పరిధిలోని నూతనంగా ఏర్పడ్డ తిరుమల నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని చెన్నాయిగుంట గ్రామ లెక్క దాఖల సర్వేనెంబర్ 195/2, 195/4లోని 41 ఎకరాల భూమిలో లబ్ధిదారులకు స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. మొదట్లో సర్వే నెంబర్లలో జగనన్న ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు స్థలాలు ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లు చేసినా ఆ తర్వాత జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఈ స్థలాన్ని సర్వే ట్రైనింగ్ అకాడమీకి బదలాయిస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. నిర్ణయం తీసుకున్న నాటి నుండి నేటి వరకు ఈ స్థలంలో ఎలాంటి కార్యకలాపాలు ప్రారంభించలేదని, జగనన్న ఇళ్ల పట్టాలు పొందిన వారికి ఇక్కడే స్థలాలు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మోదీన్, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు మీరాంబీ, కుమారి, జానకి, అములమ్మ పాల్గొన్నారు.

ఎస్వీయూలో ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ ఎంప్లాయీస్ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు బుధవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 వరకు పరీక్షల మూల్యాంకన కేంద్రంలో (స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా సమీపంలో) రెండు పోలింగ్ బూత్ లలో జరుగనున్నాయి. మొత్తం ఈ ఎన్నికలలో 9 మంది డైరెక్టర్ల కు 18 మంది అభ్యర్థులు పోటీలో వున్నారు. ఈ ఎన్నికలలో మొత్తం 581 ఓటర్లు వున్నారు. ఒక ఓటరు గరిష్టంగా 9 మంది డైరెక్టర్ల కు ఓటు వేయవచ్చును. పోలింగ్ ముగిసిన తరువాత వెంటనే కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. విజేతలను అదే రోజు ఫలితాలు ప్రకటిస్తారు. ఇందులో గెలిచిన 9 మంది అభ్యర్థులు వారిలోనే ఉపాధ్యక్షులు, కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారిని ఎన్నుకుంటారు. ఈ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇక ఈ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరగడానికి అభ్యర్థులు, సభ్యులు సహకరించాలని ఎన్నికల అధికారి యనమల లోకనాధం తెలిపారు. టెక్నికల్ స్టాఫ్ సిబ్బంది ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నగర శాఖ అధ్యక్షులు ఎస్ సురేష్ బాబు ఆధ్వర్యంలో ఉద్యోగులు తిరుపతి ఎన్జీవో హోమ్ వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగులపై ప్రభుత్వ నిరంకుశ ధోరణి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ న్యాయ పరంగా తమకు రావలసిన బకాయిలపై శాంతియుతంగా నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాలను, పోలీసుల ద్వారా ప్రభుత్వం నిరంకుశ ధోరణితో, అణచివేస్తోందన్నారు. దీన్ని వెంటనే మానుకోవాలని, ఉద్యోగులపై ప్రభుత్వం పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. ఎన్నడూ లేని విధంగా చిన్నచిన్న ఆందోళనలకు పోలీసుల ద్వారా నోటీసులు ఇవ్వడం, ఉద్యోగులను, వారి కుటుంబ సభ్యులను ఆందోళనకు గురి చేస్తోందని, ఇలాంటి కార్యక్రమాన్ని కొనసాగించడం మంచిది కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర శాఖ కార్యదర్శి బాలాజీ , గిరిబాబు, ఎం శ్రీనివాసులు, రఘు, శంకర్, ప్రేమలత, చెన్నకేశవులు, నారాయణ, హరికృష్ణ, సుబ్రహ్మణ్యం, ముని కేశవులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలు అందజేత

ప్రజాశక్తి- ఏర్పేడు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి 'పేదలందరికీ ఇల్లు కార్యక్రమం' ద్వారా జగనన్న కాలనీలో లబ్ధి పొందిన లబ్ధిదారులకు పాపా నాయుడుపేట గ్రామ సచివాలయంలో సర్పంచ్ మేకలత్తూరు లలితా కరుణాకర్ అధ్యక్షతన ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేయించి, వారికి ఇళ్ల పట్టాలు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం హరికృష్ణ, వీఆర్వో జైపాల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిఎంఅండ్‌హెచ్‌ఓ ఆఫీసులో 'గ్రీవెన్స్ డే'

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి డాక్టర్ యు.శ్రీహరి ఆధ్వర్యంలో జిల్లా వైద్య శాఖధికారి కార్యాలయంలో కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం గ్రీవెన్స్‌డే నిర్వహించారు. జిల్లాలో పనిచేసే ఉద్యోగులు తమ సమస్యలపై జిల్లా వైద్య శాఖాధికారి వ్యక్తిగతంగా కలసి వినతిపత్రాలు అందించారు. జిల్లా స్థాయిలో 20మంది పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారని, వినతులన్నింటినీ విజయవాడ గొల్లపూడిలోని ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయానికి పంపుతామని డిఎంహెచ్ఓ తెలిపారు.

వేమిరెడ్డి రెడ్డిని కలిసిన చిల్లకూరు దశరధరామిరెడ్డి

ప్రజాశక్తి -కోట : కోట మండలం దొరువు కట్ట గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు వైసీపీ పార్టీ మాజీ రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి బొకే ను అందించారు. ఇటీవల వైసీపీ మాజీ రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పలు కారణాలవల్ల వైసిపి సభ్యత్వానికి, రాజ్యసభ పదవికి రాజీనామా చేయడం అందరికి తెలిసిందే. అంతే కాకుండా త్వరలో టిడిపి తీర్థం పుచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ సందర్భంలో వైసీపీ సీనియర్ నాయకులు చిల్లకూరు దశరథ రామ రెడ్డి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నివాసంలో కలిసి పలు విషయాలపై చర్చించారు.

In The Court of the Principal Senior Civil Judge: Tirupati
O.S.No. 37/2021
T.Ramesh Reddy ...Plaintiff
V/s
P.Lalitha and 3 others ...Defendants
Summons to 4th Defendant
D4) M.Subramanayam Naidu, Flat No.18 and 26, S.No.313, Sainagar, Tirupati rural Mandal, Tirupati District.
Please take Notice that the above suit filed by the plaintiff for declaration and permanent injunction is posted to **25.03.2024** for your appearance before Principal Senior civil Judge, Tirupati at 10.30 a.m. either in person or through an advocate and file your objections. Otherwise your matter will be decided exparte.
Hearing Date: 25.03.2024
By order of Court
M.MOHAN RAJU
Advocate, Tirupati

In the Court of the I Addl. Jr.Civil Judge: Tirupati
I.A.No: 155/2023, O.S.No: 872/2019
T.Santhamma ...Petitioner/Plaintiff
V/s
The Deputy Director of Treasury Chittoor & Others
..Respondent/Defendants
Notice to Proposed Respondent No.5/ Defendant No.5
T.Gnaneswari W/o V.Sudhakar, Near Dharmarajula Gudi, Peruru Village, Tirupati Rural Mandal, Tirupati Dist.,
పై దావాలో వాది అయిన టి.శాంతమ్మ వేసిన దావాలో నిపై పిటిషన్‌లో మా హాజరు నిమిత్తమై 06.03.2024వ తేదికి వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు **06.03.2024**వ తేదిన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో నేరులో గాని, వకీలు ద్వారా గాని హాజరై మీకు గల అభ్యంతరములను తెలుపకోవలసినది లేని యెడల మీ పరోక్షములో తీర్మానించబడును.
వాయిదా తేది: **06.03.2024**
ఇరుగు శివకుమార్
న్యాయవాది, తిరుపతి. సెల్: 9885235698

In The Court of the Principal Senior Civil Judge: Tirupati
I.A.No. 207/2021, O.S.No. 37/2021
T.Ramesh Reddy ...Petitioner/Plaintiff
V/s
P.Lalitha and 3 others
...Respondents/Defendants
Notice to 4th Respondent/ 4th Defendant
R4) M.Subramanayam Naidu, Flat No.18 and 26, S.No.313, Sainagar, Tirupati rural Mandal, Tirupati District.
Please take Notice that the above I.A.No.207/2021 filed by the petitioner/ plaintiff for temporary injunction in OS 37/2021 is posted to **25.03.2024** for your appearance before Principal Senior civil Judge, Tirupati at 10.30 a.m. either in person or through an advocate and file your objections. Otherwise your matter will be decided exparte.
Hearing Date: 25.03.2024
By order of Court
M.MOHAN RAJU
Advocate, Tirupati

In the Court of the I Addl. Jr.Civil Judge: Tirupati
I.A.No: 156/2023, O.S.No: 872/2019
T.Santhamma ...Petitioner/Plaintiff
V/s
The Deputy Director of Treasury Chittoor & Others
..Respondent/Defendants
Notice to Proposed Respondent No.5/ Defendant No.5
T.Gnaneswari W/o V.Sudhakar, Near Dharmarajula Gudi, Peruru Village, Tirupati Rural Mandal, Tirupati Dist.,
పై దావాలో వాది అయిన టి.శాంతమ్మ వేసిన దావాలో నిపై పిటిషన్‌లో మా హాజరు నిమిత్తమై 06.03.2024వ తేదికి వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు **06.03.2024**వ తేదిన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో నేరులో గాని, వకీలు ద్వారా గాని హాజరై మీకు గల అభ్యంతరములను తెలుపకోవలసినది లేని యెడల మీ పరోక్షములో తీర్మానించబడును.
వాయిదా తేది: **06.03.2024**
ఇరుగు శివకుమార్
న్యాయవాది, తిరుపతి. సెల్: 9885235698

In the Court of the I Addl. Jr.Civil Judge: Tirupati
I.A.No: 154/2023, O.S.No: 872/2019
T.Santhamma ...Petitioner/Plaintiff
V/s
The Deputy Director of Treasury Chittoor & Others
..Respondent/Defendants
Notice to Proposed Respondent No.5/ Defendant No.5
T.Gnaneswari W/o V.Sudhakar, Near Dharmarajula Gudi, Peruru Village, Tirupati Rural Mandal, Tirupati Dist.,
పై దావాలో వాది అయిన టి.శాంతమ్మ వేసిన దావాలో నిపై పిటిషన్‌లో మా హాజరు నిమిత్తమై 06.03.2024వ తేదికి వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు **06.03.2024**వ తేదిన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో నేరులో గాని, వకీలు ద్వారా గాని హాజరై మీకు గల అభ్యంతరములను తెలుపకోవలసినది లేని యెడల మీ పరోక్షములో తీర్మానించబడును.
వాయిదా తేది: **06.03.2024**
ఇరుగు శివకుమార్
న్యాయవాది, తిరుపతి. సెల్: 9885235698

శ్రీ పొట్టిశ్రీరాములు ప్రాథమికోన్నత పాఠశాల, గూడూరు
ఉద్యోగ ప్రకటన
ఆం.ప్ర.గౌరవ ఉన్నత న్యాయస్థానం CC No SRNo:26369 in WPNo.40923/2022 నందు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు జిల్లా విద్యాశాఖాధికారి గారు నెల్లూరు వారి అనుమతితో శ్రీ పొట్టిశ్రీరాములు ప్రాథమికోన్నత పాఠశాల నందు క్రింద తెలిపిన పోస్టుల (గ్రాంటి ఇన్‌ఎయిడ్) నియామకమునకు దరఖాస్తులు కోరుచున్నవి. అర్హులైన వారివారి విద్యార్హతలు, పాస్‌పోర్టుసైజ్ ఫోటోలు మరియు కులధృవీకరణ పత్రము కలిగిన అటెస్టెడ్ సర్టిఫికెట్లు నకళ్లతో కలిపి తేది 5-3-2024లోపు స్వంత చిరునామా కలిగి తగిన పోస్టేజి స్టాంపులు అతికించిన కవరు జతచేసి ఈ క్రింది అడ్రస్సుకు రిజిష్టర్‌పోస్టులో/ స్వయంగా పంపవలసినదిగా కోరడమైనది (ప్రభుత్వ నిబంధనలకు లోబడి).
Hindhi Pandit - 1 Gr II,
Telugu Pandit - 1 Gr II,
SGT BCA
Correspondent
SPSUP School
Guduru